# బాబుతో నీ లాలూచీ ఏంది రేవంత్?

- బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి పీఎఫ్ఆర్ సమర్పించిన ఏపీ
- నదుల అనుసంధానం పేరుతో 60% కేంద్ర నిధులతో ప్రాజెక్టు
- ఏపీ సర్కార్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మౌనమెందుకు?
- బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం జులై 17న రైల్ రోకో
- జులై 16-18 మధ్య ప్రయాణం వాయిదా వేసుకోవాలి
- కార్యాచరణ ప్రకటించిన బీఆర్ఎస్ శాసనమండలి సభ్యురాలు కవిత ప్రకటన



హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరిట 60 శాతం కేంద్రం నిధులతో ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టు నిర్మించే ప్రయత్నం చేస్తుంటే.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం దీనిపై ఎందుకు స్పందించడం లేదు..? చంద్రబాబు, రేవంత్‌రెడ్డికి మధ్య ఉన్న లాలూచీ ఏమిటి? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిలదీశారు. నదీజలాల వాటా విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రానికి పీఎఫ్ఆర్‌ను ఏపీ సీఎం చంద్రబాబు సమర్పించినా, రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం చాలా దుర్మార్గమని నిప్పులు చెరిగారు. గోదావరి జిల్లాలను బనకచర్ల ప్రాజెక్టు పేరుతో నీటిని తరలించుకుపోతుంటే రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉండిపోతున్నారో చెప్పాలని నిలదీశారు. గోదావరి జిలాలపై ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గోదావరి నదిలో వృథా అవుతున్న నీటిని ఇక్కడి పంట పొలాలకు మళ్లించాలన్నది తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆలోచన అని, అందుకే తుపాకులగూడెం వద్ద నుంచి గోదావరి, కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు పనులు చేపట్టాలని ఆనాడే కేసీఆర్ వాదించినట్టు తెలిపారు. దీని వల్ల తెలంగాణలో సగం జిల్లాలకు గోదావరి నీరు పుష్కలంగా లభించే అవకాశం ఉంటుందని, పోలవరం నుంచి లింకేజీ ప్రతిపాదనను గతంలోనే జగన్ తీసుకొస్తే కేసీఆర్ వ్యతిరేకించారని ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత గుర్తుచేశారు.

### బీసీల రిజర్వేషన్ల కోసం పోరుబాట

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా రాష్ట్రప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే.. వందలాది మందితో నామినేషన్లు వేయిస్తామని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. ప్రతీ వార్డులో, పంచాయతీలలో భారీగా నామినేషన్లు దాఖలు చేయిస్తామని చెప్పారు. ఢిల్లీకి వెళ్లడంలో అర్ధశతకం పూర్తిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. బీసీ బిల్లుపై ప్రధానితో ఎందుకు మాట్లాడలేకపోయారని ప్రశ్నించారు. బీసీ బిల్లు ఆమోదం కోసం తెలంగాణ వికసిత్ యాత్ర పేరిట బీజేపీ యాత్ర చేస్తామనడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. బీసీ బిల్లు కోసం జూలై 17న పెద్ద ఎత్తున రైల్ రోకో కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నేథప్యంలో జూలై 16, 17, 18 తేదీల్లో రైలు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ కేంద్ర సభ్యుడు గాజర్ల రవి మృతికి సంతాపం వ్యక్తంచేశారు.

# ఆదివాసీల పొట్టకొడుతున్న రేవంత్‌రెడ్డి

- కేసీఆర్ భూములిస్తే.. రేవంత్‌రెడ్డి లాక్కుంటున్నారు: ఆర్ఎస్ ప్రవీణ్
- జీవో 49 వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం తప్పదు: కోవ లక్ష్మి



హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం కవ్వాల్ టైగర్‌జోన్ పరిరక్షణ పేరుతో జారీ చేసిన జీవో 49.. గిరిజనులు, ఆదివాసీలకు జీవన్మరణ సమస్యగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలను మోసం చేస్తూ.. వారి పొట్ట కొడుతున్నాడని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఇతర నేతలతో కలిసి ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్‌ను, పెసా చట్టాన్ని ఉల్లంఘిస్తూ జీవో 49ను జారీ చేసిందని తెలిపారు. 7 పులల పరిరక్షణ పేరుతో 7 లక్షల మంది ఆదివాసీ, గిరిజన గూడేల ప్రజలను నిర్వాసితులను చేసే కుట్రతోనే జీవో తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివాసులు, గిరిజనుల భూములకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పట్టాలిస్తే.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఆ భూములను లాక్కుని, జనాలను తరిమికొడుతున్నారని నిప్పులుచెరిగారు.

### ప్రభుత్వం దిగిరాకపోతే పోరాటం తప్పదు: కోవ లక్ష్మి

ఆదివాసీల హక్కులను కాలరాసేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో 49ను ఉపసంహరించుకోకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఆదివాసులకు 4.5 లక్షల ఎకరాలకు పట్టా పాస్ పుస్తకాలు, రైతుబంధు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల జీవన విధానాలను గౌరవించడంలేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు తుంగబాలు, కేశవరావు, అభిలాశ్‌రావు, పూదరి సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్ పీఎస్‌లో తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్

# ఒక సంతకం..4 గంటలు!

- తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌కు ఖానాపూర్ పీఎస్‌లో తప్పని నిరీక్షణ
- ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆగ్రహం

ఖానాపూర్ టౌన్, జూన్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీల అమలుపై ప్రజల పక్షాన సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌పై ఇదివరకే పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరిలో నమోదైన ఈ కేసుల్లో ఇదివరకే కండిషన్ బెయిల్ మంజూరైంది. ఇందులో భాగంగా ప్రతీ బుధవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు హాజరై రిజిస్టర్‌లో సంతకం చేయాల్సి ఉన్నది. అందులో భాగంగానే బుధవారం ఆయన తన లాయర్లతో కలిసి ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వెంటనే సంతకం తీసుకొని పంపించకుండా దాదాపు 4 గంటలకు పైగా దిలీప్‌ను నిరీక్షించేలా చేశారు. దీంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్ బయట గూమిగూడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కక్షపూరిత విధానాలతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదని కార్యకర్తలు విమర్శలు గుప్పించారు.

# ఆపరేషన్ కగార్‌పై 23న రాజ్‌భవన్ ముట్టడి

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులు, మావోయిస్టులను హతమారుస్తూ కేంద్ర ప్రభుత్వం నరమేధానికి పాల్పడుతున్నదని, ఈ వైఖరిని విడనాడాలని అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 23న చలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వారు ప్రకటించారు. బుధవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో చలో రాజ్‌భవన్ కార్యక్రమ గోడ పత్రికను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిచర్చలు జరపాలంటూ ప్రజాసంఘాల నేతలు, మావోయిస్టు ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినా కేంద్రం పట్టించుకోకుండా మావోయిస్టులు, గిరిజనులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నదని మండిపడ్డారు. అడవుల్లోని సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికే ఈ నరమేధాన్ని సృష్టిస్తున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కుదురుమళ్ల గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలకు గులాబీ కండువా కప్పుతున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


# సీఎం ఇలాకాలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

**బీఆర్ఎస్‌లో భారీగా చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు • కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే పట్నం**

బొంరాస్‌పేట, జూన్ 18 : సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ నియోజకవర్గంలోని దుద్యాల మండలం కుదురుమళ్ల గ్రామానికి చెందిన 100 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మడిగే శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి ప్రాధాన్యత దక్కడం లేదని తెలిపారు. అవమానాలు భరించలేక కాంగ్రెస్‌ను వీడినట్టు చెప్పారు. సీఎం సొంత నియోజకవర్గంలో కొత్త, పాత నాయకుల మధ్య సయోధ్య లేదని, గ్రామాల్లో కొత్తగా చేరిన వారికే ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల్లో కష్టపడిన వారికి అడుగడుగునా అవమానం జరగడంతోనే పార్టీ మారినట్టు చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. సర్పంచ్, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌దే గెలుపు అన్నారు.

# ఆంధ్రా అధికారులకు రెడ్ కార్పెట్!

- విద్యుత్తు సంస్థల్లో మళ్లీ ఏపీ ఆధిపత్యం!
- కీలక డైరెక్టర్ పోస్టులు ఇచ్చేందుకు సిద్ధం
- ఏపీ మూలాలున్న ఆఫీసర్లకు అవకాశం
- మరో మూడు రోజుల్లో ఉత్తర్వులు
- వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు
- ఇంజినీర్ల సంఘాల సమావేశం
- ఉద్యమానికి సిద్ధమంటూ సంకేతాలు



హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థలో ఆంధ్రా అధికారుల ఆధిపత్యానికి కాంగ్రెస్ సర్కార్ రెడ్ కార్పెట్ పరుస్తున్నది. అత్యంత కీలకమైన డైరెక్టర్ పోస్టులను ఆ అధికారులకు కట్టబెట్టబోతున్నది. దాదాపు సగం డైరెక్టర్ పోస్టులకు ఆంధ్రా ఆఫీసర్ల చేతుల్లో పెట్టబోతున్నారని విస్తృత ప్రచారం జరుగుతున్నది. తెలంగాణ బిడ్డలను పక్కనబెట్టి మరీ ఆంధ్రా అధికారులకు స్వాగతం పలుకుతున్నారని, ఇందుకు సర్కారు పెద్దలు కూడా ఒకే అనేశారని గుసగుసలు. ట్రాన్స్‌కో, టీజీఎస్పీడీసీఎల్ సహా ఇతర విద్యుత్తు సంస్థల అత్యంత కీలకమైన డైరెక్టర్ పోస్టులను ఆ ఆంధ్రా అధికారులకు అప్పగించబోతున్నారని విద్యుత్తుసౌధ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతున్నది. కొన్ని పేర్లు కూడా ప్రచారంలోకి వచ్చాయి. ఒకట్రెండు రోజుల్లో ఆయా పేర్లను ఖరారు చేస్తూ ఉత్తర్వులు కూడా విడుదల కానున్నట్టు సమాచారం. ఈ తతంగం వెనుక పెద్ద ఎత్తున చేతులు మారినట్టు ప్రచారం జరుగుతున్నది. కొందరు రూ.2 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ముట్టజెప్పినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. నాలుగు సంస్థల్లో డైరెక్టర్ పోస్టులకు 2024 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీచేసి, దరఖాస్తులను ఆహ్వానించారు. ఆయా పోస్టులకు దాదాపు 150 దరఖాస్తులు వచ్చాయి. వీరికి ఏప్రిల్ 9, 10 తేదీల్లో ఇంటర్వ్యూలను సైతం నిర్వహించారు. అర్హతలు లేని కొందరిని ఎంపిక కమిటీ ఇంటర్వ్యూలు చేయడంపై అప్పట్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

### ఎంపిక జాబితా తారుమారు

ఇంటర్వ్యూల అనంతరం ఎంపిక కమిటీ ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున షార్ట్‌లిస్ట్ చేసి ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ జాబితా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం వద్దకు వెళ్లింది. జాబితాలోని పేర్లున్న వారిపై ఇంటెలిజెన్స్ విచారణ కూడా పూర్తయింది. అవినీతి, ఏసీబీ ఇతర కేసులు, వారి పనితీరుపై పరిశీలన సైతం ముగిసింది. ఈ తరుణంలోనే పైరవీలు మొదలయ్యాయి. కేసులున్న వారు, ఆరోపణలున్న వారు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పెద్ద ఎత్తున సమర్పించుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే జాబితా మొత్తం తారుమారైనట్టు విద్యుత్తు సౌధలో ప్రచారం జరుగుతున్నది. అన్ని స్థాయిల్లో కొన్ని పేర్లు గల్లంతు కాగా, కొన్ని కొత్త పేర్లు వచ్చి చేరినట్టు వార్తలు గుప్పుమంటున్నాయి.

### ఈ పోస్టులపైనే అనుమానాలు

ట్రాన్స్‌కో ప్రాజెక్ట్స్, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ పోస్టుల్లో ఒకదానికి ఆంధ్రా అధికారి పేరు ఎంపిక చేస్తారని ప్రచారంలో ఉన్నది. జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టును కూడా ఆంధ్రా అధికారికే కట్టబెడతారని గుసగుసలు వినిపిస్తున్నాయి. టీజీఎస్పీడీసీఎల్‌లో రెండు డైరెక్టర్ పోస్టులకు వివాదాస్పద అధికారుల పేర్లు వినిపిస్తున్నాయి. తనకు సన్నిహితుడైన సీజీఎం స్థాయి అధికారి కోసం ఓ సీఎండీ పట్టుబడుతున్నట్టు కూడా వార్తలొస్తున్నాయి. ఇప్పటికే డైరెక్టర్లుగా పనిచేస్తున్న తెలంగాణ వారిని పక్కన పెట్టినట్టు సమాచారం. వీరికి అవకాశాలు తక్కువన్న ప్రచారం జరుగుతున్నది.

### పోరుకు సిద్ధమవుతున్న ఇంజినీర్లు

ఆంధ్రా అధికారులను డైరెక్టర్లుగా నియమించే ప్రయత్నాలపై విద్యుత్తు ఉద్యోగులు, ఇంజినీర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆంధ్రా ఆధిపత్యంపై మరో పోరుకు సిద్ధమవుతున్నారు. ఇదే అంశంపై కొన్ని ఉద్యోగ సంఘాలు, ఇంజినీర్ల సంఘాల బుధవారం ముందస్తుగా భేటీ అయ్యాయి. ఆంధ్రా అధికారులను డైరెక్టర్లుగా నియమించడం- పర్యవసానాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. స్వరాష్ట్రంలో ఈ వివక్ష ఏమిటని, ఆంధ్రా అధికారులకు పెద్దపీట వేయడమేమిటని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశంపై గురువారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కలిసి తమ నిరసనను వ్యక్తం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఆంధ్రా అధికారులను నియమిస్తే మరో ఉద్యమానికి వెనుకాడొద్దని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు సమాచారం. సమ్మెకు దిగాలని, సర్కారును స్తంభింపజేయాలని నిర్ణయానికి వచ్చినట్టు ఉద్యోగ సంఘాల నేతల ద్వారా తెలుస్తున్నది.



ఇందిరమ్మ ఇల్లు వచ్చిందనే ఆనందంతో పాత ఇంటిని కూలగొడుతున్న సడువలి (ఫైల్)

# ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని..
# ఉన్న ఇల్లు కూలగొట్టుకున్నడు

- తుది జాబితాలో పేరు లేక రోడ్డునపడ్డ నిరుపేద సడువలి
- మంచిర్యాల జిల్లాలో విచిత్ర ఘటన

చెన్నూర్ రూరల్, జూన్ 18 : ఇందిరమ్మ ఇల్లు మంజూరైందన్న ఆనందంతో ఉన్న ఇంటిని కూలగొట్టుకున్నాడో వ్యక్తి. తీరా తుది జాబితాలో తన పేరు లేకపోవడంతో రోడ్డున పడ్డాడు. ఈ విచిత్ర ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామంలో చోటుచేసుకున్నది. కొమ్మెరలోని ఎస్సీ కాలనీకి చెందిన లేతకరి సడువలి బర్రెలు కాస్తూ భార్యా పిల్లలను పోషించుకుంటున్నాడు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నాడు. జాబితాలో పేరు వచ్చిందని అధికారులు సర్వేకు వచ్చారు. పాత ఇంటి ఫొటో తీసుకొని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆపై కాంగ్రెస్ కమిటీ సభ్యులు.. లేతకరి సడువలి పేరును ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చేర్చారు. ఇల్లు మంజూరైందన్న సంతోషంలో పాత ఇంటిని కూలగొట్టించాడు. ఏమైందో ఏమో తెలియదుగానీ.. ఇందిరమ్మ ఇండ్ల చివరి జాబితాలో పేరు రాలేదని అధికారులు చెప్పారు. దీంతో సడువలి తీవ్రనిరాశకు గురయ్యాడు. ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని ఉన్న ఇంటిని కూలగొటుకుని రోడ్డున పడ్డానని, అధికారులు స్పందించి రెండో జాబితాలోనైనా ఇల్లు వచ్చేలా చూడాలని వేడుకుంటున్నాడు.

# నీకు ఇందిరమ్మ ఇల్లు రాదు పో..!

- మా ఇండ్ల మీద పడి ఏడుపెందుకు?
- దివ్యాంగురాలిపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం
- బాధతో దివ్యాంగురాలి కంటతడి

గీసుగొండ, జూన్ 18 : 'నీకు ఇల్లు రాదు.. మా ఇండ్ల మీద పడి ఎందుకు ఏడుస్తున్నవ్?' అంటూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అవమానించారని ఓ దివ్యాంగురాలు కన్నీటి పర్యంతమైంది. దివ్యాంగుల కోటాలోనైనా ఇల్లు ఇవ్వాలని వేడుకోగా 'నీకు ఏ కోటాలోనూ ఇల్లు రాదు. ఇక్కడి నుంచి వెళ్లిపో' అని తేల్చిచెప్పారని తెలిపింది. ఎమ్మెల్యే మాటలతో మనస్తాపం కలిగిందంటూ బాధితురాలు నిర్మల విలపించింది. వివరాల్లోకి వెళ్తే వరంగల్ గరీబ్‌నగర్ కాలనీకి చెందిన లింగంపల్లి నిర్మల పరదాలు కట్టుకొని నివసిస్తున్నది. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చిన రేవూరి తమ పరిస్థితిని చూసి 'నీవు దివ్యాంగురాలివి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీకే ముందుగా ఇందిరమ్మ ఇల్లు ఇస్తా' అని హామీ ఇచ్చారని నిర్మల తెలిపింది. తాజాగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో తన పేరు రాలేదని చెప్పేందుకు భర్త సురేశ్‌తో కలిసి ఎమ్మెల్యే ఇంటికి వెళ్లానని పేర్కొంది. తాను వెళ్లడాన్ని చూసిన ఎమ్మెల్యే అసహనంగా వ్యవహరించారని తెలిపింది. బాధితురాలిని డివిజన్ కార్పొరేటర్ మనీషా శివకుమార్, బీఆర్ఎస్ నేతలు ఓదార్చారు.



వరంగల్‌లోని గరీబ్‌నగర్ కాలనీలో తన గోడు చెప్పుకుంటున్న దివ్యాంగురాలు నిర్మల

# గోదావరి నీటిపై ఏపీకి హక్కుంది!

- బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై చంద్రబాబుకు శిష్యుడు రేవంత్‌రెడ్డి లేఖ రాశారా?
- ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): సముద్రంలో వృథాగా పోయే గోదావరి నీటిని వినియోగించుకునే హక్కు ఆంధ్రప్రదేశ్‌కు ఉందని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్లపై కేంద్రం సరైన నిర్ణయం తీసుకుటుందని చెప్పారు. బనకచర్లపై కేంద్రం కనీసం ప్రీఫిజిబులిటీ డాక్యుమెంట్లు కూడా చూడలేదని తెలిపారు. బనకచర్లపై ఏపీ సీఎం చంద్రబాబుకు.. ఆయన ప్రియమైన శిష్యుడు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారా? మాట్లాడారా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తనను పిలవలేదని, మహేశ్‌కుమార్‌గౌడ్ ఫోన్‌ను ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడంలేదని సందేహం వ్యక్తం చేశారు. బనకచర్లపై అఖిలపక్షం సమావేశానికి ఎవరు హాజరవ్వాలో పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు.

# రేవంత్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై పౌరహక్కుల నేతల ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని పౌరహక్కుల సంఘం నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ధన్వాడలో పోలీసుల దాడిలో గాయపడిన వారిని పరామర్శించడానికి బుధవారం పౌరహక్కుల సంఘం రాష్ట్ర కమిటీ నేతలు వెళ్తుండగా.. ఎర్రవల్లి చౌరస్తాలో అదుపులోకి తీసుకుని ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో గంటల తరబడి నిర్బంధించినట్టు పేర్కొన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, నేతలు నారాయణ రావు, సుభాన్ తదితరులు ఉన్నారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన విద్యుత్తుశాఖ ఎస్‌ఈ నరేశ్

# 80 వేలు లంచంతో దొరికిన ఎస్‌ఈ

మహబూబాబాద్ రూరల్, జూన్ 18 : కాంట్రాక్టర్ నుంచి రూ. 80 వేలు లంచం తీసుకుంటూ మహబూబాబాద్ జిల్లా విద్యుత్తు శాఖ ఎస్‌ఈ నరేశ్ బుధవారం ఏసీబీ అధికారులకు దొరికాడు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం ఓ కాంట్రాక్టర్‌కు రూ. 20 లక్షల వరకు వర్క్స్ చేసేందుకు లిమిట్ ఉందని, ఇంకా పనులు చేపట్టేందుకు అనుమతి కోరగా సంబంధిత ఏఈ, డీఈలు సమ్మతించి, ఫైల్‌ను ఎస్‌ఈ నరేశ్‌కు పంపారు. కాంట్రాక్టర్ ఎస్‌ఈని కలువగా రూ. లక్ష లంచం డిమాండ్ చేశాడు. ఈ మేరకు ఈ నెల 14న రూ. 20 వేలు తీసుకున్నాడు. బుధవారం 80వేలు తీసుకుంటూ దొరికాడు.

# మావోయిస్టు నేత గణేశ్ ఎన్‌కౌంటర్

- అల్లూరి జిల్లాలో 2 గంటల పాటు భీకరంగా జరిగిన ఎదురుకాల్పులు
- ఏవోబీ సభ్యురాలు అరుణ, ఏరియా కమిటీ సభ్యుడు అంజు కూడా మృతి
- కేంద్రం శాంతిచర్చలు జరపాలంటూ ఇటీవల లేఖ విడుదల చేసిన అరుణ
- గాజర్ల రవిపై రూ.కోటి నగదు రివార్డు
- 2004లో చర్చల ప్రతినిధి గాజర్ల రవి
- రవి మృతితో చిన్నబోయిన వెలిశాల



ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గాజర్ల రవి (ఫైల్)



ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అరుణ(ఫైల్)

వరంగల్, జూన్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కొత్తగూడెం ప్రగతి మైదాన్/జయశంకర్ భూపాలపల్లి, జూన్ 18 (నమస్తే తెలంగాణ)/టేకుమట: మావోయిస్టు అగ్రనేత, 2004 చర్చల్లో ఆనాటి సర్కారుతో జరిగిన చర్చల్లో హాజరైన ఆఖరి నేత గాజర్ల రవి అలియాస్ గణేశ్ సహా మరో ఇద్దరు కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో బుధవారం భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆ ముగ్గురు అగ్రనేతలు మృతిచెందారు. రంపచోడవరం-మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గ్రేహౌండ్స్ భద్రతా దళాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుపడిన మావోయిస్టులు, గ్రేహౌండ్స్ బలగాల మధ్య సుమారు రెండు గంటలపాటు భీకర ఎన్‌కౌంటర్ జరిగినట్టు తెలుతున్నది. భద్రతా దళాల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం ఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్రా-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్ అలియాస్ గణేశ్ అలియాస్ బిరుసు, ఏపీ రాష్ట్ర కమిటీ, ఏవోబీ సభ్యురాలు వెంకటరవి లక్ష్మీచైతన్య అలియాస్ అరుణ అలియాస్ రూపి, మరొకరిని ఏరియా కమిటీ సభ్యుడు అంజుగా పోలీసులు గుర్తించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి(సీసీఎం)పై మూడు రాష్ట్రాల్లో కలిపి రూ.కోటి నగదు రివార్డు, ఏపీ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామానికి చెందిన అరుణ (ఎస్‌జెడ్‌సీఎం)పై రూ.25 లక్షల నగదు రివార్డులు ఉన్నాయి. గత జనవరి 21న ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు గరియాబంద్ జిల్లా కులరీఘాట్ దండకారణ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్యే అరుణ. శాంతి చర్చలు జరపాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ విడుదల చేసిన ఆమె.. తాజా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

### ముగిసిన శాంతిచర్చల ప్రతినిధుల ప్రస్థానం

మావోయిస్టు కీలక నేత గాజర్ల రవి ఎన్‌కౌంటర్‌తో 2004లో ఆనాటి సర్కారుతో జరిగిన శాంతిచర్చల్లో హాజరైన ప్రతినిధుల విప్లవ ప్రస్థానం ముగిసినట్టయింది. గాజర్ల రవి మరణంతో చర్చల్లో పాల్గొన్న వారి ఉద్యమ ప్రస్థానంపై చర్చ జరుగుతున్నది. గాజర్ల రవి మూడున్నర దశాబ్దాల అజ్ఞాత జీవితానికి తెరపడింది. ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో విప్లవ పార్టీల తరపున ఐదుగురు అగ్రనేతలు ఆనాటి చర్చల్లో పాల్గొన్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేతలైన అక్కిరాజు హరగోపాల్ (ఆర్కే), చలం (సుధాకర్), గాజర్ల రవి(గణేశ్), జనశక్తి తరపున రియాజ్, కూర దేవేందర్ (అమర్) పాల్గొన్నారు. కాలక్రమంలో వీరిలో ముగ్గురు భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో, ఒకరు అనారోగ్యంతో మరణించారు. చర్చల్లో పాల్గొన్న జనశక్తి పార్టీ నేత అమర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి తాజాగా జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందాడు